సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 19 । నవంబర్ । 2024



ముమ్మరంగా సమగ్ర సర్వే

ఇంటింటి సమగ్ర సర్వే జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. సోమవారం నాటికి 67 శాతం మేర పూర్తయింది.

8లో



... జాగ్రత్తలు తప్పనిసరి

గనుల్లో బ్లాస్టింగ్ సమయాన రక్షణ సూత్రాలు పాటించాలని డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఉమేష్ ఎం.సావర్కర్ సూచించారు.

8లో

గరిష్టం / కనిష్టం
29° / 17°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది. రాత్రి పూట వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు బీసీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ

ఖమ్మం సహకారనగర్: బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం ఖమ్మం కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం 10గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన రాజకీయ పార్టీలు, సంఘాల నాయకులు, ప్రజలు బీసీ వర్గాలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో అవసరమైన రిజర్వేషన్ల దామాషాపై అభిప్రాయాలు తెలియచేయొచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆరు సెట్ల పత్రాలను వెరిఫికేషన్ అఫిడవిట్‌తో పాటు రూ.20 నాన్ జ్యూడీషియల్ స్టాంపు పేపర్‌పై తెలుగు లేదా ఆంగ్ల భాషల్లో ఇవ్వాల్సి ఇవ్వాలని సూచించారు.

చిన్నారి చికిత్సకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న పీఓ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని ఏఎస్ఆర్ కాలనీకి చెందిన రాధ అనే మహిళకు పుట్టిన పాప అనారోగ్యానికి గురి కాగా వైద్య ఖర్చుల కోసం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సోమవారం ఆర్థిక సాయం అందించారు. చిన్నారి పుట్టినప్పటి నుంచి నిమ్ముతో బాధపడుతోందనే విషయం తెలియగానే ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుంచి రూ 25 వేల చెక్కు తల్లి రాధకు అందజేశారు.

సంస్థ ఆస్తుల పరిరక్షణకు పాటుపడాలి



జీఎం లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): శిక్షణలో నేర్చుకున్న ప్రతీ అంశాన్ని విధి నిర్వహణలో అమలుచేస్తూ సింగరేణి ఆస్తులను కాపాడాలని జనరల్ మేనేజర్(సెక్యూరిటీ) సీహెచ్.లక్ష్మీనారాయణ సూచించారు. కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధి ఎస్ అండ్ పీసీ సెంటర్‌లో సెక్యూరిటీ సిబ్బంది శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సెక్యూరిటీ సిబ్బంది వృత్తి నైపుణ్యంతో విధులు నిర్వర్తించేలా శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు. గనులు, డిపార్ట్‌మెంట్లతో పాటు అన్ని ఏరియాల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులు సంస్థ ఆస్తుల పరిరక్షణను బాధ్యతగా భావించాలని సూచించారు. ట్రెనింగ్ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్ మాట్లాడగా జీఎంను ఉద్యోగులు సన్మానించారు.

లాభాల ట్రాక్‌లో ఆయిల్‌పామ్..



పామాయిల్ దిగుమతులపై తిరిగి సుంకం విధింపు

- కొత్తగా రవాణా చార్జీలు, అత్యధిక ఓఈఆర్‌తో ధర పెంపు
- భూమి పట్టాలతో సంబంధం లేకుండా సబ్సిడీపై మొక్కలు
- సంప్రదాయ సాగులో తగ్గిన లాభాలు, ఉద్యాన పంటలపై రైతుల ఫోకస్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గత నాలుగేళ్లుగా ఆశాజనకంగా లేని పామాయిల్ సాగు ప్రస్తుతం లాభాల ట్రాక్ ఎక్కుతోంది. ఇటీవల ప్రభుత్వం తీసుకున్న పలు కీలక నిర్ణయాలే ఇందుకు కారణం. దీంతో సంప్రదాయేతర పంటల సాగులో మరోసారి పామాయిల్‌పై దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది.

వినియోగంలో 40 శాతం..

దేశవ్యాప్తంగా వంటలో ఉపయోగించే నూనెలో దాదాపు 40 శాతం పామాయిలే ఉంటోంది. ఇంతగా డిమాండ్ ఉన్నప్పటికీ దేశంలో పామాయిల్ సాగు తక్కువ. ఎక్కువగా మలేషియా, ఇండోనేషియా, ఉక్రెయిన్ వంటి దేశాల నుంచే దిగుమతి అవుతోంది. అయితే స్థానికంగా ఉండే రైతులకు ఇబ్బంది రాకుండా దిగుమతులపై 49 శాతం సుంకాన్ని కేంద్రం విధించేది. కానీ 2022లో మొదలైన ఉక్రెయిన్ – రష్యా యుద్ధంతో ప్రపంచ వ్యాప్తంగా సప్లయ్ చైన్ దెబ్బతినగా పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని కేంద్రం ఎత్తి వేసింది. దీంతో విదేశాల నుంచి దిగుమతి పెరగడంతో స్థానిక ఉత్పత్తులకు ధర తగ్గి నాలుగేళ్లుగా పామాయిల్ రైతులకు లాభాలు పడిపోయాయి.

20 శాతం సుంకం విధిస్తూ..

విదేశాల నుంచి దిగుమతి అయ్యే పామాయిల్‌పై 20 శాతం సుంకం విధిస్తూ కేంద్రం ఇటీవల నిర్ణయం తీసుకుంది. ఫలితంగా పామాయిల్ రేటు టన్నుకు సగటున రూ. 2 వేల వరకు పెరిగే అవకాశం ఉంది. సుంకం విధించడానికి ముందు టన్ను పామాయిల్ గెలల ధర రూ.13,950 ఉండగా, ఇప్పుడు రూ.19,144కు పెరిగింది. దీంతో పాటు ఆయిల్ ఫ్యాక్టరీలో గెలల నుంచి వచ్చే ఆయిల్ పరిమాణం ఆధారంగా (ఓఈఆర్) చెల్లించే బోనస్‌ను పెంచుతూ రాష్ట్ర సర్కారు నిర్ణయం తీసుకుంది. గతంలో సగటు ఓఈఆర్ ఆధారంగా బోనస్ చెల్లింపులు ఉండేవి. కానీ ఇందుకు విరుద్ధంగా గరిష్ట ఓఈఆర్‌ను పరిగణనలోకి తీసుకుని బోనస్ ఇవ్వాలని ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు. దీంతో టన్ను గెలలపై అదనంగా రూ.2 వేల వరకు ఆయిల్‌పామ్ రైతులు లాభపడే అవకాశం కలిగింది. దీనికి తోడు తోట నుంచి ఆయిల్ ఫ్యాక్టరీ వరకు గెలల రవాణాకు సంబంధించి టన్నుకు రూ.190 అదనంగా చార్జీలు చెల్లించాలని ఈ ఏడాది నిర్ణయించారు. దీంతో ఈసారి ఆయిల్‌పామ్ రైతులు మంచి లాభాలు పొందే అవకాశం ఏర్పడింది.

ఇదే గరిష్టం కాదు..

గత నాలుగైదేళ్లతో పోల్చితే ప్రస్తుతం ఆయిల్‌పామ్ రైతులకు గరిష్ట లాభాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అయితే గతంలో ఇంతకంటే అధిక లాభాలను ఆయిల్‌పామ్ రైతులు సాధించారు. దిగుమతి సుంకం 49 శాతంగా ఉన్నప్పుడు ప్రస్తుతం ఉన్న బోనస్‌లు, రవాణా చార్జీలు ఏమీ లేకుండానే ఆఫ్ సీజన్‌లో టన్నుకు గరిష్టంగా రూ.25,000 వరకు ధర పలికిన సందర్భాలు ఉన్నాయి. పెట్టుబడి ఖర్చులు పెరిగినందున ఇప్పుడు టన్ను గెలలకు రూ.20,000 వస్తేనే రైతులకు గిట్టుబాటు అయ్యే పరిస్థితి ఉంది. అందువల్ల ప్రస్తుతం తీసుకున్న సానుకూల నిర్ణయాలతోనే ఆగిపోకుండా ఆయిల్‌పామ్‌ను ప్రోత్సహించేలా మరిన్ని నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా ఆయిల్‌పామ్‌లో వ్యర్థాలుగా మిగిలే మట్టలను తిరిగి సాగులో (మల్చింగ్) ఉపయోగించుకునేలా చాప్ కటింగ్ యూనిట్లను జిల్లాలో స్థాపించాలనే డిమాండ్ ఉంది. గెలల కోత కూలీలకు ప్రమాదం జరిగితే బీమా సౌకర్యం కల్పించాలని రైతులు చాలా ఏళ్లుగా కోరుతున్నారు. మొక్కలు నాటిన మొదటి మూడేళ్లలో ఉచిత ఎరువుల కోసం నగదు కాకుండా ఎరువులే సరఫరా చేయాలని అంటున్నారు.

మంచి ధర ఇవ్వడం ఆనందదాయకం



ఆయిల్‌పామ్ రైతులు అడిగినట్లుగా అత్యధిక ఓఈఆర్‌ను ప్రామాణికంగా తీసుకుని ధర నిర్ణయించడం ఆనందదాయకం. మా వినతికి సానుకూలంగా స్పందించి ప్రభుత్వం ధర పెంచి రైతులకు శుభవార్త తెలిపింది. రైతులకు అవసరమైన ఇతర సౌకర్యాలు కూడా కల్పించాలని కోరుతున్నాం.

– ఆలపాటి రామచంద్రప్రసాద్, తెలంగాణ ఆయిల్ పామ్ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు

మంత్రి తుమ్మల కృషితో రైతులకు మేలు



వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వతహాగా ఆయిల్‌పామ్ రైతు కావడంతో రైతుల కష్టాలు తెలుసు. అందుకే ఆయిల్‌పామ్ ధర పెంపునకు తీవ్రంగా కృషి చేశారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి దిగుమతి సుంకం పెంపునకు దోహదపడ్డారు. మేం అడిగిన వెంటనే ఆఫ్ సీజన్‌లో అశ్వారావుపేట నుంచి అప్పారావుపేటకు గెలల రవాణా చార్జీలు పెంపుదల చేయించారు.

– బండి భాస్కర్, రైతు సంఘం నాయకుడు

ఉద్యాన పంటలే మేలు..

తేమ శాతం పేరుతో ఈ ఏడాది జిల్లాలో పత్తికి సరైన ధర రాక ఆ పంట సాగు చేసిన రైతులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో మార్కెట్‌కు వెళ్లే బదులు చేల దగ్గర, ఇంటి వద్ద దళారులు, ప్రైవేటు వ్యాపారులు నిర్ణయించిన ధరకే అమ్ముకుంటున్నారు. ఇక గతేడాది దాపురించిన నల్లి తెగులు మిర్చి రైతుల కంట కన్నీరు నింపింది. ఈ క్రమంలో సంప్రదాయ పంటల స్థానంలో ప్రత్యామ్నాయ సాగు పద్ధతులు, ఉద్యాన పంటల దిశగా రైతులు దృష్టి పెట్టాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇప్పటికే మునగ సాగుపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ చేపట్టింది. మరోవైపు ఏజెన్సీ మండలాల్లో భూమి పట్టాలతో సంబంధం లేకుండా ఆసక్తి ఉన్న రైతులందరికీ సబ్సిడీపై ఆయిల్‌పాం మొక్కలు అందించేందుకు సర్కారు సిద్ధం అవుతోంది. అయితే కొత్త మొక్కలు అందించడం, సాగు విస్తీర్ణం పెంచడంలో సర్కారు చేస్తున్న ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితుల మధ్య ఉన్న వత్యాసాన్ని తగ్గించడంపై జిల్లా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రైతులు అంటున్నారు.

వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓకు పదోన్నతి

పాల్వంచరూరల్: పాల్వంచలోని వన్యప్రాణుల విభాగం (వైల్డ్‌లైఫ్) ఎఫ్‌డీఓగా విధులు నిర్వహిస్తున్న బి.బాబుకు డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(డీసీఎఫ్)గా పదోన్నతి కల్పిస్తూ పీసీసీఎఫ్ రాకేష్ మోహన్ డోబ్రియాల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీనియారిటీ ప్రకారం తనకు పదోన్నతి లభించినా, ప్రస్తుతం ఉన్న చోటే విధులు నిర్వహించనున్నట్లు బాబు తెలిపారు.



డీసీఎఫ్‌గా పదోన్నతి పొందిన బాబు

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు



శివయ్యకు పుష్పాంజలి సేవ చేస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు ముత్తంగి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. ముందుగా తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శివాలయంలో పుష్పాంజలి..

శ్రీసీతారామచంద్ర స్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా స్వామివారికి పుష్పాంజలి సేవ వైభవంగా నిర్వహించారు. అనంతరం అర్చకులు రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

పర్యాటక కేంద్రంగా రేగులగండి

- అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం



చినరాయిగూడెం వద్ద చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

మణుగూరు టౌన్: మండలంలోని కూనవరం పంచాయతీలోని రేగులగండిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ జితేష్ పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం మణుగూరులో పర్యటించిన ఆయన తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావుతో సమావేశమయ్యారు. ఆ తర్వాత రేగులగండి చెరువు, చినరాయిగూడెం నుంచి గోదావరి పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. రేగులగండి చెరువులో బోటింగ్, సైక్లింగ్ పడవలు ఏర్పాటు చేయాలని, పర్యాటకులకు అవసరమైన ఏర్పాట్లకు సంబంధించి ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. పర్ణశాల నుంచి మణుగూరు, చినరాయిగూడెం వచ్చేందుకు పడవలు అందుబాటులో ఉంచితే సమయం, డబ్బు ఆదా అవుతాయని చెప్పారు. తద్వారా వ్యాపార అభివృద్ధికి సైతం అడుగులు పడే అవకాశం ఉంటుందన్నారు.

చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం

పినపాక: రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మండలంలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో సంచులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం మద్దతు ధరతో పాటు బోనస్ కల్పిస్తుందని, ప్రతీ రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కొనుగోలులో అక్రమాలకు జరిగితే కఠిన చర్యలు ఉంటాయని సిబ్బందిని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ తాతారావు, తహసీల్దార్ నరేష్, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గోదారమ్మకు పుణ్యనదీ హారతి



గోదావరికి హారతులు సమర్పిస్తున్న అర్చకులు, వేద పండితులు

భద్రాచలంటౌన్: శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన పుణ్య నదీ హారతి కార్యక్రమంతో భద్రాచలంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. రామాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామివారి దేవాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గోదారమ్మకు నదీ హారతి సమర్పించారు. కార్తీక మాసంలో శివుడికి ఎంతో ఇష్టమైన సోమవారం రోజున భక్తులు, వేదపండితులు హారతులతో నదీమతల్లికి నీరాజనం పలికారు. మేళతాళాలతో ఆలయం నుంచి బయలుదేరిన భక్తుల జై శ్రీరామ్, ఓం నమః శివాయ నామస్మరణలతో గౌతమీ తీరం పులకించింది. అర్చకుల ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ఈఓ రమాదేవి దంపతులు గోదావరికి పసుపు, కుంకుమ, వస్త్రాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పుణ్య నదీ హారతి కార్యక్రమాన్ని తిలకించారు.

నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు



విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

- అందుకు బీజం పాఠశాలల్లోనే పడాలి
- దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతోంది..
- జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్ ప్రారంభోత్సవ సభలో ఎంపీ రఘురాంరెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి, ఎమ్మెల్యే జారే..

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ) : దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకుపోతోందని, నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలుగా ఎదగాలంటే పాఠశాలల్లోనే బీజం పడాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. అన్నపురెడ్డిపల్లిలోని గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫేర్‌ను సోమవారం ఆయన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలోనూ డ్రోన్ల వాడకం వచ్చిందని, అధునాతన వైద్యం సైతం రోబోటిక్స్ ద్వారా చేస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం అన్ని రంగాలను సాంకేతికత శాసిస్తోందని తెలిపారు. ఎంపీ కోటా ద్వార కేంద్ర నిధులను ఈ ప్రాంత అభివృద్ధికి కేటాయిస్తానని చెప్పారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ.. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసే లక్ష్యంతోనే ఇక్కడ సైన్స్‌ఫేర్ ఏర్పాటు చేశామని తెలిపారు. తన జీవిత మూలాలు విద్యారంగం నుంచే ముడిపడి ఉన్నాయని, తన పదవీ కాలంలో విద్య, వైద్య రంగాలకే ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ జోనల్ అధికారి స్వరూపారాణి, డీఈఓ వెంకటేశ్వరాచారి, డీఎస్ఓ చలపతిరాజు, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఎస్.మాధవరావు, పాఠశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణమూర్తి, ఎంపీడీఓ మహాలక్ష్మి, ఎంఈఓ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

ఏర్పాట్లపై ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ

అన్నపురెడ్డిపల్లి గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫేర్‌కు వచ్చిన విద్యార్థులకు సదుపాయాల కల్పనపై ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి రెండు వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా, ఏర్పాట్లపై వారం రోజులుగా శ్రమిస్తున్న ఎమ్మెల్యే సోమవారం రాత్రి విద్యార్థులకు దగ్గరుండి భోజనాలు వడ్డించారు.

ఎంతో ఉపయోగకరం



ఇక్కడ ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన మాకెంతో ఉపయుక్తం. సెనోటర కసియటోర (తగిరస) మొక్కల ఆకులను రసంగా చేసి విషసర్పాలు కాటు వేసిన చోట అద్దితే వెంటనే ఫలితం కనిపిస్తుంది. ఇది శాస్త్రీయంగా నిరూపితమైంది. ఈ ప్రయోగం ఈ ప్రదర్శన ద్వార వెలుగు చూస్తుందని ఆశిస్తున్నాం.

– బి.ఉదయచంద్రిక, టి.మౌనిక, పూసుగూడెం(ములకలపల్లి)

రైతులకు ఉపకరిస్తుంది



ఇక్కడ ఏర్పాటు చేసిన సైన్స్‌ఫేర్ మాకు ఉపయోగకరంగా ఉంది. సాంకేతికంగా మేము చేసిన లైఫ్ సేవర్‌స్టిక్ ప్రయో గం రైతులకు ఉపయోగపడుతుంది. ట్రిమ్మర్, పీవీసీ పైపు, స్విచ్, కనక్టర్, లైట్‌లో తయారు చేసిన లైఫ్ సేవర్‌స్టిక్‌లతో రాత్రి వేళల్లో రైతులు విషసర్పాల బారి నుంచి కాపాడుకోవచ్చు.

– ఎం సంతోష్‌కుమార్, పి.నిరంజన్‌కుమార్, అన్నపురెడ్డిపల్లి

ఈ ప్రదర్శనలు స్ఫూర్తినిస్తాయి



ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు మాకెంతో స్ఫూర్తినిస్తాయి. ప్రమాదాల నివారణ, విద్యుత్ ఆదా కోసం నేను చేసిన ప్రయోగం ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. సెన్సార్ సహాయంతో చేసిన వీధిలైట్లు వాహనాలు, మనుషులు దారి వెంట వెళ్తున్నప్పుడు వాటంతట అవే వెలుగుతాయి. మళ్లీ అవే ఆరిపోవడంతో విద్యుత్ ఆదా అవుతుంది.

– బి సృజన, మల్లెలమడుగు (అశ్వాపురం)

ఫ్లోటింగ్‌హౌస్‌లు ప్రయోజనకరం



ఫ్లోటింగ్ హౌస్ నిర్మాణాలు ప్రయోజనకరం. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఇవి ఉపయుక్తంగా ఉంటాయి. భూమి ఉపరితలానికి ఎత్తులో నిర్మించడం ద్వారా ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా నివారించవచ్చు. మా ప్రయోగం ఈ ప్రదర్శన ద్వారా వెలుగు చూడడం సంతోషంగా ఉంది.

– గుగులోత్ అర్చన (టీజీఎంఆర్ఎస్, కొత్తగూడెం)

హైడ్రోపోనిక్ వ్యవసాయంపై ప్రయోగం



పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భూమి లేనందున హైడ్రోపోనిక్ వ్యవసాయం ద్వారా ఆహార ఉత్పత్తులు పండించవచ్చు. ఈ పద్ధతి ద్వార తొలిసారి 1929లో ఇరాక్‌లో ప్రయోగం చేశారు. భారతదేశంలో కూడా 1946లో ప్రయోగాత్మకంగా చేశారు. ఈ పద్ధతి ద్వారా ట్రేల్లో వర్మికంపోస్టు నింపి నీటిని అందించి పంటలు సాగు చేయొచ్చు.

– కె.చరణ్, కె.రవితేజ (టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, దమ్మపేట)

మురుగునీరు శుద్ధి



మురికి నీటిని శుద్ధి చేసేందుకు మేం చేసిన ప్రయోగం ఈ వైజ్ఞానిక ప్రదర్శన ద్వారా వెలుగుచూస్తుంది. కంకర, ఇసుక, బొగ్గును ఉపయోగించి మురికి నీటిని శుద్ధి చేయొచ్చు. మళ్లీ ఆ నీటిని అవసరాలకు వాడుకోవచ్చు. ఇలాంటి ప్రదర్శనలు ఎక్కువ ఏర్పాటు చేయాలి.

– కె.కేశవసాయి, వై.ప్రతిమేష్ (భద్రాచలం)

ముగిసిన గ్రూప్ - 3 పరీక్షలు

- జిల్లాలో 6,312 మంది అభ్యర్థులు గైర్హాజరు



పరీక్ష అనంతరం సింగరేణి మహిళా కళాశాల కేంద్రం నుంచి బయటకు వస్తున్న అభ్యర్థులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో గ్రూప్-3 పరీక్షలు సోమవారం ముగిశాయి. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు ఒక పరీక్ష, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30 వరకు రెండో పరీక్ష జరగగా, సోమవారం ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు మూడో పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 39 సెంటర్లలో పరీక్ష నిర్వహించారు. మొత్తం 13,478 మంది అభ్యర్థులకు గాను 7,166 మంది హాజరు కాగా, 6,312 మంది గైర్హాజరయ్యారు. హాజరు శాతం 53.17 శాతంగా నమోదైంది. కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్ పరీక్షలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పలు సెంటర్లలో తనిఖీ చేశారు. బయోమెట్రిక్ విధానం ఉండడంతో అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి అరగంట ముందే చేరుకున్నారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యంకలగకుండా వైద్య, పారిశుద్ధ్య, విద్యుత్ శాఖల అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ వివిధ ప్రాంతాల నుంచి కొత్తగూడెం, పాల్వంచకు ప్రత్యేక బస్సులు నడిపింది. అధికారులు పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించగా, పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటుచేశారు. ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రంలోకి అనుమతించలేదు. పరీక్షల నిర్వహణ కోసం అధికారులకు, సిబ్బందికి అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వగా, ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

క్లుప్తంగా

ప్రిన్సిపాల్ చాంబర్ ఎదుట విద్యార్థుల బైఠాయింపు

దుమ్ముగూడెం : మండలంలోని లక్ష్మీనగరం ఏకలవ్య పాఠశాలలో రోజుకో సమస్య బయటకు వస్తోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక ఆదివాసీ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, అయినా ఉన్నతాధికారులు స్పందించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పాఠశాలలో గణితం బోధించే ఉపాధ్యాయుడు దసరా సెలవులకు ముందే బదిలీ అయ్యారని, ఆ తర్వాత ఎవరినీ నియమించలేదంటూ పదో తరగతి విద్యార్థులు సోమవారం ప్రిన్సిపాల్ చాంబర్ ఎదుట ధర్నా చేశారు. మరో మూడు నెలల్లో విద్యాసంవత్సరం ముగియనుందని, తమకు సిలబస్ పూర్తి కాక ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. నెలరోజులు దాటినా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ధర్నా గురించి తెలియగానే తల్లిదండ్రులు సైతం పాఠశాలకు వెళ్లి ఆందోళన చేశారు. అనంతరం ఆర్‌సీఓ నాగార్జునరావు అక్కడికి చేరుకుని మంగళవారం గణితం ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

బస్సులు ఆపాలని విద్యార్థుల ఆందోళన



ఎస్‌ఐ రఫీకి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

ఏన్కూరు: ఆర్టీసీ బస్సులు ఆపాలంటూ ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం తహసీల్ ఎదుట ఆందోళన చేశారు. గ్రీవెన్స్ డే సందర్భంగా ఆందోళన చేయడంతో పాటు తహసీల్దార్, ఎస్‌ఐ రఫీకి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట రిక్వెస్ట్ స్టాప్ ఉన్నా బస్సులు ఆపడం లేదని, ఫలితంగా ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. ఇకనైనా ఆర్టీసీ అధికారులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు నర్సింహారావు, రామారావు, షాజీద్, మహేష్ పాల్గొన్నారు.

సిండికేట్‌పై చర్యలు తీసుకోకపోతే కార్యాలయాల ముట్టడి

టేకులపల్లి: అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ పేదలను దోచుకుంటున్న మద్యం సిండికేట్‌పై ప్రభుత్వం, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేన భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం టేకులపల్లిలో సోమవారం మాట్లాడుతూ ఇల్లెందు ఎక్సైజ్ శాఖ పరిధిలో సిండికేట్‌గా మారిన వ్యాపారులు ఎంఆర్‌పీకి మించి రేట్లతో మద్యం విక్రయిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై సేవాలాల్ సేన ఆధ్వర్యాన ఇల్లెందు, కొత్తగూడెం, భద్రాచలం ఎక్సైజ్ శాఖ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేసి ఆందోళనలు చేపట్టినా అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించకపోతే ఎక్సైజ్ శాఖ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడి వెంకటేష్నాయక్, నాయకులు బానోతు నాగరాజునాయక్, బాదావత్ సురేష్నాయక్, లాలునాయక్, బానోతు కిషన్ నాయక్, లక్పతి నాయక్ పాల్గొన్నారు.

కూలీల వ్యాన్ బోల్తా



ఘటనలో గాయపడి సొమ్మసిల్లిన కూలీలు

తల్లాడ: మండలంలోని నరసింహారావుపేట భద్రాద్రి కోల్డ్ స్టోరేజ్ ఎదుట సోమవారం కూలీల మినీ వ్యాన్ బోల్తా పడగా పలువురు గాయపడ్డారు. కల్లూరు మండలం కొర్లగూడెం గ్రామానికి చెందిన 28 మంది కూలీలు మినీ వ్యాన్‌లో పత్తి తీసేందుకు ఏన్కూరు మండలం హిమామ్‌నగర్‌కు వెళ్లి సాయంత్రం తిరిగొస్తున్నారు. నరసింహారావుపేట వద్ద వ్యాన్ అతివేగంగా వెళ్తున్న క్రమాన కోల్డ్ స్టోరేజ్‌లోకి వెళ్తున్న లారీని తప్పించబోయి అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈఘటనలో వ్యాన్‌లోని పలువురు కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో స్థానికులు చేరుకుని వ్యాన్‌ను పైకి లేపగా, పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రైలుకింద పడి ఏపీ వాసి ఆత్మహత్య

బోనకల్: మండలంలోని మోటమర్రి రైల్వేస్టేషన్ సమీపాన ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం విభరింతలపాడుకు చెందిన కొత్త శ్రీనివాసరావు(60) ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకున్నాడని ఖమ్మం జీఆర్‌పీ ఎస్‌ఐ పి.భాస్కర్‌రావు తెలిపారు. మృతదేహాన్ని మధిరకు చెందిన ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ దోర్నాల రామకృష్ణ సహకారంతో మధిర ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర రూ.19,144

ముమ్మరంగా సమగ్ర సర్వే

- పది రోజులు.. 2,25,488 ఇళ్లలో పూర్తి
- ఒక్కో ఇంటికి కనీసం అరగంట సమయం
- జిల్లాలో 67 శాతం పూర్తి



ఇంటింటి సర్వేలో వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

చుంచుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వే జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. నాలుగు మున్సిపాలిటీలు, 481 గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న సర్వేలో నిత్యం అన్ని విభాగాలకు చెందిన అధికారులు 2,655 మంది పాల్గొంటున్నారు. సర్వే సిబ్బందిపై పర్యవేక్షణకు ప్రత్యేకంగా మరో 236 మంది సూపర్‌వైజర్లతో పాటు నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అధికారులు ఉన్నారు. ఉపాధ్యాయులు ఉదయం పాఠశాల విధులకు హాజరై మధ్యాహ్నం తర్వాత సర్వేకు వెళ్తుండగా ఇతర విభాగాల సిబ్బంది పూర్తి సమయం పాల్గొంటున్నారు. జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే ఈనెల 6న మొదలైనా.. ఇంటింటికీ వివరాల సేకరణ మాత్రం 9వ తేదీన ప్రారంభమైంది. పది రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 67 శాతం పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఒక్కో ఇంట్లో 75 అంశాలను ప్రశ్నించి, వివరాలు నమోదు చేయాల్సి ఉండగా స్థానికుల నుంచి సహకారం కొరవడిందని ఎన్యూమరేటర్లు వాపోతున్నారు. సర్వేకు వెళ్లిన సమయంలో ఇళ్ల వద్ద ఎవరూ ఉండడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ఇంటి చిరునామా సరిగా లేక ఎన్యూమరేటర్లు ఇబ్బంది పడుతున్నారు. వారు ఇంటికి వచ్చాక యజమానులు ఆధార్, రేషన్ కార్డుల కోసం వెదుకుతుండటంతో చాలా సమయం పడుతోంది. ఇక ఇంటి యజమానులు వివరాలు వెల్లడించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. పలువురు ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

అన్ని వివరాలు చెప్పడం లేదు

సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియలో ఎన్యూమరేటర్లు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఒక్కో ఇంట్లో ఒక్కో రకమైన సమస్య ఎదురవుతోంది. సమగ్ర సర్వే చేసేందుకు వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులతో పాటు అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను నియమించింది. రోజువారీ లక్ష్యాన్ని చేరుకోవడానికి పాధ్యాయులు తప్ప ఇతర శాఖల సిబ్బంది ఉదయం 7 గంటలోపే సర్వే కోసం కాలనీల బాట పడుతున్నారు. సాయంత్రం 5 గంటల వరకు సర్వే చేస్తున్నారు. ఎన్యూమరేటర్ల సంఖ్యను బట్టి ఒక్కొక్కరికి 150 నుంచి 175 ఇళ్ల వరకు కేటాయించారు. అయితే సర్వేలో 75 అంశాలను ప్రశ్నించి, వివరాలు నమోదు చేయాల్సి ఉండగా స్థానికుల నుంచి సహకారం కొరవడిందని ఎన్యూమరేటర్లు అంటున్నారు. కొందరు ఇంటి యజమానులు.. 'మీ కెందుకు వివరాలు చెప్పాల'ంటూ ఎన్యూమరేటర్లను ప్రశ్నిస్తున్నారు. సర్వేలో పేర్కొన్న స్థిరాస్తి తదితర ఆర్థిక అంశాలు పూర్తిగా చెప్పడం లేదు. ఒక్కో ఇంట్లో వివరాల సేకరణకు కనీసం అర్ధగంట పడుతోందని ఎన్యూమరేటర్లు చెబుతున్నారు. పలు గ్రామాల్లో ఉదయం 9 గంటలకే ఇళ్లకు తాళాలు వేసి వ్యవసాయ, ఇతర పనులకు వెళ్తున్నారు. పూర్తి వివరాలు చెబితే ఏమవుతుందోననే భయంతో మరి కొందరు చెప్పడం లేదు. దీంతో తమకు కేటాయించిన లక్ష్యం చేరుకునేందుకు ఎన్యూమరేటర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇక స్టిక్కర్లు వేసినప్పుడు ఒకే కుటుంబంగా చెప్పిన వారు.. సిబ్బంది సర్వేకు వెళ్లినప్పుడు ఒక ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు ఉన్నాయని చెబుతున్నారు. ఇలా అదనపు సమయం పడుతోంది.

ఈనెల 26 వరకు సర్వే పూర్తి



జిల్లాలో సమగ్ర సర్వే చురుగ్గా జరుగుతోంది. ఇప్పటివరకు 67 శాతం మేర పూర్తయింది. ఇంటి యజమానులు ఎన్యూమరేటర్లకు సహకరించి అన్ని వివరాలూ చెప్పాలి. ఎప్పటికప్పుడు సర్వే తీరును పరిశీలించాలని అధికారులకు సూచించాం. ఈనెల 26వ తేదీ వరకు జిల్లాలో సర్వే పూర్తి చేస్తాం.

– డి.వేణుగోపాల్, అదనపు కలెక్టర్

3,36,407	67
జిల్లాలో సర్వే చేయాల్సిన ఇళ్లు	నమోదైన సర్వే శాతం
2,25,488	1,10,919
సోమవారంవరకు పూర్తి చేసినవి	ఇంకా సర్వే చేయాల్సిన ఇళ్లు

'ఆషా' క్రికెట్ టోర్నీ విజేత మణుగూరు



మణుగూరు జట్టుకు కప్ అందచేస్తున్న విపంచి, విరాజి

సత్తుపల్లి: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన ఆషా మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో మణుగూరు జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్స్‌లో సత్తుపల్లి జట్టుపై విజయం సాధించి మణుగూరు జట్టు ట్రోఫీ కైవసం చేసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, డాక్టర్ దయానంద్ ఆధ్వర్యాన ఈ టోర్నీ నిర్వహించారు. సత్తుపల్లి టీఎస్‌బీ జట్టు, మణుగూరు మజ్జు జట్లు ఫైనల్స్‌లో తలపడగా మజ్జు జట్టు విజేతగా నిలిచింది. ఈమేరకు విజేత జట్టుకు రూ.50వేలు, రన్నరప్ జట్టుకు రూ.30వేల నగదు బహుమతులు, ట్రోఫీలను ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి కుమార్తెలు విపంచి, విరాజి అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ టి.కిరణ్, మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్‌బాబుతో పాటు వందనపు సత్యనారాయణ, దొడ్డా శ్రీనివాసరావు, ఎం.డీ.కమల్‌పాషా, మట్టా సుజాత, చింతలపాటి సత్యనారాయణ, చల్లగుళ్ల నర్సింహారావు, మలిరెడ్డి మురళీరెడ్డి, గోలి శ్రీనివాసరెడ్డి, భరత్, పింగళి సామేలు, సత్యనారాయణరెడ్డి, వంశీ పాల్గొన్నారు.

బ్లాసింగ్ సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఉమేష్ ఎం.సావర్కర్

సింగరేణి(కొత్తగూడెం): గనుల్లో బ్లాసింగ్ సమయాన రక్షణ సూత్రాలు పాటిస్తూ ప్రమాదాలను నివారించాలని డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఉమేష్ ఎం.సావర్కర్ సూచించారు. కొత్తగూడెం ఆర్‌సీఓఏ క్లబ్‌లో పేలుడు పదార్థాల వినియోగంపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనుమతించబడిన పేలుడు పదార్థాలు, డిటోనేటర్ల నాణ్యత, భద్రత, పనితీరును పరీక్షించాకే ఉపయోగించాలని తెలిపారు. బ్లాస్టింగ్ విధులు నిర్వర్తించే ఉద్యోగులు అన్ని జాగ్రత్తలు పాటించాలని, ఇందుకోసం అధికారులు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఏరియా జీఎం శాలేం రాజు మాట్లాడుతూ సింగరేణిలో ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు రక్షణపై తరచుగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమావేశంలో వివిధ విభాగాల అధికారులు సనత్‌కుమార్, కమలేష్‌కుమార్‌వర్మ, కేజీ. తివారి, కోటిరెడ్డి, సూర్యనారాయణరాజు, బి.రవీందర్, రమేష్, ప్రహ్లాద్, వెంకటేశ్వరరావు, నాయకులు ఎండీ.రజాక్, మల్లికార్జున్‌రావు, ఉపేందర్‌బాబు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల బంద్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలను మంగళవారం నుంచి నిరవధికంగా బంద్ చేయనున్నారు. ఈ మేరకు ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ బాధ్యులు సోమవారం హనుమకొండలో కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డికి నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ బాధ్యులు మాట్లాడుతూ రెండేళ్ల నుంచి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోగా ముఖ్యమంత్రిని కలిసే సమయం ఇవ్వలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక అధ్యాపకులు, సిబ్బందికి వేతనాలు ఇవ్వలేకపోతున్నామని చెప్పారు. అయినా డిగ్రీ, పీజీ విద్యార్థులు నష్టపోవద్దనే కారణంతో తరగతులు నిర్వహించామని, గతంలో ఓసారి కళాశాలలను బంద్ చేయగావిద్యాశాఖ సెక్రటరీ బుర్రా వెంకటేశం తమను పిలిచి మాట్లాడి వారంలో విడుదల చేస్తామని చెప్పినా నేటికీ చెల్లించలేదన్నారు. దీంతో మంగళవారం నుంచి కళాశాలల నిరవధిక బంద్‌కు నిర్ణయించామని, ఈనెల 26 నుంచి జరిగే డిగ్రీ పరీక్షలు కూడా బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. వీసీకి నోటీసు అందజేసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రవీంద్రనాథ్, బాధ్యులు జి.వేణుమాధవ్, గోలి వెంకట్, ఎం.శ్రీనివాస్, కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో చిన్నారి మృతి



చిన్నారి మృతికి సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్యే కూనంనేని తదితరులు

జూలూరుపాడు: అనారోగ్యంతో ఎనిమిదేళ్ల చిన్నారి సోమవారం మృతి చెందింది. మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన పాలెపు ప్రభాకర్–రాధిక దంపతుల కుమార్తె సాహితి(8)కి ఈనెల 15న జ్వరం రావడంతో తల్లిదండ్రులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. చిన్నారికి వైద్యులు పరీక్షలు చేయగా లివర్‌కు ఇన్‌ఫెక్షన్‌తోపాటు, రెండు కిడ్నీలు దెబ్బతిన్నట్లు తేలింది. ఈ క్రమంలో పరిస్థితి విషమించి సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది. భార్యాభర్తలు ప్రభాకర్, రాధిక రోజూ కూలి పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రిలో చూపించే ఆర్థిక స్థోమతలేక కూతురును కాపాడుకోలేకపోయామని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సందర్శించి సంతాపం తెలిపారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా, మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఎస్కే నాగుల్‌మీరా, గార్లపాటి వీరభద్రం, గుడిమెట్ల సీతయ్య, ఎస్కే చాంద్‌పాషా, వల్లమల సామేలు, నిమ్మటూరి లచ్చయ్య, మహేష్, శివకృష్ణ ఉన్నారు.

పత్తి రైతుపై ప్రైవేట్ వ్యాపారి దాడి

సుజాతనగర్: పత్తికి సరైన ధర ఎందుకు ఇవ్వరంటూ ప్రశ్నించిన రైతుపై ప్రైవేట్ వ్యాపారి దాడికి పాల్పడిన సంఘటన సుజాతనగర్‌లోని ప్రైవేట్ పత్తి యార్డులో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సర్వారం గ్రామానికి చెందిన రైతు భద్రి తన కుమారుడు నాగేశ్వరరావుతో కలిసి పత్తిని విక్రయించేందుకు సుజాతనగర్‌లోని ప్రైవేట్ పత్తి యార్డుకు వెళ్లాడు. యార్డులో ఉన్న ఓ వ్యాపారితో క్వింటా పత్తిని రూ.6,500కు అమ్మేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. వాహనం నుంచి పత్తిని దింపుతున్న క్రమంలో పత్తిలో తేమ ఉందని, నాణ్యత లేదంటూ, ధర తగ్గిస్తానని వ్యాపారి తెలిపాడు. దీంతో సరైన ధర ఎందుకు ఇవ్వరంటూ ప్రశ్నించడంతో ఆ వ్యాపారి సదరు రైతు చెంపపై కొట్టాడు.

దాడి ఘటనలో కేసు నమోదు

బూర్గంపాడు: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వెళ్లిన రెవెన్యూ అధికారులపై దాడి పాల్పడి ఘటనలో సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజేష్ కథనం ప్రకారం.. ఈ నెల 16న రాత్రి సారపాక వద్ద గోదావరిలో ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న వారిని పట్టుకునేందుకు డిప్యూటీ తహసీల్దార్ రామ్‌నరేష్, ఆర్‌ఐ ముత్తయ్య, రెవెన్యూ సిబ్బంది వెళ్లారు. ఈ క్రమంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులు రెవెన్యూ అధికారులపై దాడికి యత్నించారు. ఈ ఘటనపై ఆర్‌ఐ ముత్తయ్య ఫిర్యాదు మేరకు 45మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నారేప చెట్టు నరికివేత

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు అటవీ సెక్షన్ పరిధిలోని పాపకొల్లు బీట్–బీలో గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా నారేప చెట్టును నరికివేశారు. సోమవారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న అటవీ సిబ్బంది అటువైపు వెళ్లగా గమనించిన దుండగులు పారిపోయారు. నారేప చెట్టు విలువ రూ 40 వేల వరకు ఉంటుందని, ఈ సంఘటనపై పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశామని జూలూరుపాడు ఎఫ్‌ఆర్‌ఓ జి.ప్రసాద్‌రావు తెలిపారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్ట్

అశ్వాపురం: మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో ఇద్దరిపై కత్తితో దాడి చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సీఐ అశోక్‌రెడ్డి కథనం ప్రకారం.. సీతారాంపురం గ్రామంలో రెండు రోజుల క్రితం సప్కా వీరన్న, సప్కా రవిపై అదే గ్రామానికే చెందిన సప్కా పవన్ కత్తితో దాడి చేశాడు. దీంతో ఇద్దరూ గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అశ్వాపురంలో నిందితుడిని అరెస్ట్ చేశారు. విచారించగా నేరం అంగీకరించాడని, అతని వద్ద కత్తిని స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారని పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్య



సాగరిక (ఫైల్)

గుండాల: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆళ్లపల్లి మండలంలో సోమవారం జరిగింది. ఎస్సై రతీష్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని మర్కోడు గ్రామానికి చెందిన జల్లారపు సాగరిక (25)ను అనిశెట్టిపల్లికి చెందిన రంజిత్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. అయితే ఎనిమిదేళ్ల క్రితం దంపతులు మర్కోడు గ్రామం వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులు తాళలేక సాగరిక మనస్తాపం చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై ఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడిన కారు

పెనుబల్లి: కారు అదుపు తప్పి పక్కనే వరి పొలాల్లో దూసుకెళ్లి బోల్తా పడగా అందులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఖమ్మం నుంచి పెనుబల్లి మండలం లంకాసాగర్‌కు సోమవారం కారులో ఆరుగురు వస్తుండగా టేకులపల్లి వద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న వరి పొలాల్లో బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఖమ్మంకు చెందిన కల్యాణి, బిందు, శ్రావణి, కిరణ్‌తో పాటు ఇద్దరు చిన్నారులకు గాయాలు కావడంతో స్థానికులు బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గురుకులాల్లో స్టడీ అవర్స్ నిర్వహణ తప్పనిసరి

భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్



దర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలంఅర్బన్: గిరిజన సంక్షేమ ఆశ్రమ గురుకుల పాఠశాలల్లో ప్రతిరోజు తప్పనిసరిగా ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించాలని, ఈ విషయమై స్పెషల్ ఆఫీసర్లు, హెచ్ఎంలు, వార్డెన్లు పర్యవేక్షించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదేశించారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన గిరిజనుల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు శ్రద్ధ వహించాలని తెలిపారు. గిరిజన దర్బార్‌లో అందుతున్న దరఖాస్తులను ప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. కాగా, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో స్టడీ అవర్స్ నిర్వహనపై దృష్టి సారించాలని తెలిపారు. ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రనాథ్, గురుకులాల ఆర్‌సీఓ నాగార్జునరావుతో పాటు రాంబాబు, భాస్కరన్, మునీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటికి ముస్తాబు చేయాలి

ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియం వద్ద పెండింగ్ పనులు పూర్తిచేసి ముక్కోటి నాటికి భక్తులను ఆకర్షించేలా ముస్తాబు చేయాలని ఐటీడీఏ ఏపీఓ డేవిడ్‌రాజ్ సూచించారు. గిరిజన మ్యూజియంను పరిశీలించిన ఆయన మట్టి ఇల్లు, బోటింగ్ కోసం చెరువును సిద్ధం చేయాలని, పరిసరాల్లో పిచ్చి చెట్లను తీయించాలని తెలిపారు. గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాస్, మ్యూజియం క్యూరేటర్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

వసతికి ఏర్పాట్లు చేస్తాం..

వృద్ధురాలిని కోరిన జిల్లా వెల్ఫేర్ అధికారులు



వృద్ధురాలితో మాట్లాడుతున్న జిల్లా వెల్ఫేర్ ఫీల్డ్ ఆఫీసర్, ఐసీడీఎస్ అధికారులు

మణుగూరు టౌన్: వృద్ధురాలి వసతికి ఏర్పాట్లు చేస్తామని జిల్లా అధికారులు హామీ ఇచ్చారు. మండలంలో రెండు నెలలుగా రోడ్డు పక్కన చెట్ల నీడనే ఆశ్రయంగా మార్చుకుని జీవనం సాగిస్తున్న వృద్ధురాలి పరిస్థితిపై ఈ నెల 15న 'సాక్షి'దినపత్రికలో 'చెట్టు కిందే వృద్ధురాలి జీవనం'శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో వృద్ధురాలు కుదుర్ల సుశీల వద్దకు సోమవారం జిల్లా అధికారులు వచ్చారు. జిల్లా వెల్ఫేర్ ఫీల్డ్ ఆఫీసర్ నరేష్, ఐసీడీఎస్ సీడీపీఓ జయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ ఆమె ఉంటున్న స్థలాన్ని సందర్శించారు. తోపుడు బండి కావాలని, తనకు వృద్ధాప్య పింఛన్ తొలగించి దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని ఈ సందర్భంగా వృద్ధురాలు కోరింది. స్పందించిన అధికారులు అందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆరిఫా రోష్నీ వృద్ధాశ్రమంలో కావాల్సిన ఏర్పాట్లు చేశామని, అక్కడా చేర్పిస్తామని సూచించారు. కానీ వృద్ధురాలు నిరాకరించడతో బాధితురాలి నివాసమైన గాంధీనగర్‌లో వసతులు కల్పించి అక్కడికి తరలించేలా చర్యలు తీసుకునేందుకు ప్రణాళిక రూపొందించారు.

రెండో రోజూ ప్రశాంతం..



పాల్వంచ: కేఎల్ఆర్ డిగ్రీ కళాశాల వద్ద హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది



పాల్వంచరూరల్: గురుకుల కళాశాల వద్ద తనిఖీలు చేస్తున్న సిబ్బంది

పాల్వంచ: పాల్వంచలో రెండో రోజు సోమవారం నిర్వహించిన టీజీ పీఎస్సీ గ్రూప్–3 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని కేఎల్ఆర్ ఇంజినీరింగ్, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ జేసీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రెజీనా స్కూల్, కేఎల్ఆర్ ఫార్మసీ, టీడబ్ల్యూ ఆశ్రమ హైస్కూల్, టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ గర్ల్స్, డీఏవీ స్కూల్, అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల, గౌతమి స్కూల్, నారాయణ స్కూల్, టీజీటీడబ్ల్యూఆర్‌డీసీ, కేఎల్ఆర్ పీజీ కళాశాల మొత్తం 13 సెంటర్లలో ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు నిర్వహించారు.

పాల్వంచ మండలంలో..

పాల్వంచరూరల్: మండలంలోని లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో సోమవారం రెండో రోజు నిర్వహించిన గ్రూప్–3పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. నిర్దేశించిన పరీక్ష సమయానికి గంట ముందే అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోగా సిబ్బంది తనిఖీలు నిర్వహించి లోపలికి పంపించారు. ఇద్దరు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో లోపలికి అనుమతి ఇవ్వలేదు.

నేను డ్రైవరన్నను..!

చిన్నారిని లాలించిన ఆర్టీసీ డ్రైవర్ మల్లయ్య



ఒడిలో చంటిబిడ్డతో ఆర్టీసీ డ్రైవర్ మల్లయ్య



డ్రైవర్‌ను సత్కరిస్తున్న ఆర్ఎం సరిరామ్, అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: మహాలక్ష్మి పథకం అమలుతో పలు సమయాల్లో రద్దీ దృష్ట్యా ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు కొందరు నిర్దేశిత ప్రాంతాల్లో ఆపడం లేదని, నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని అక్కడక్కడా ఫిర్యాదులు వస్తున్నాయి. కానీ ఈ డ్రైవర్ మాత్రం అత్యవసర పరిస్థితుల్లో మహిళా ప్రయాణికురాలి బిడ్డను లాలించి అభిమానం చూరగొన్నాడు. అంతేకాక అధికారుల నుంచి సన్మానం అందుకున్నాడు. వివరాలు.. ఇటీవల మణుగూరు నుండి హైదరాబాద్‌కు చంటి బిడ్డతో ఓ మహిళ బస్సులో వెళ్తోంది. ఆమె మార్గమధ్యలోని ఓ బస్టాండ్‌లో వ్యక్తిగత అవసరాలపై దిగాల్సి రాగా వెంట ఎవరూ లేకపోవడంతో బిడ్డను ఎవరికి అప్పగించాలో తెలియక సందిగ్ధత ఎదుర్కొంది. చివరకు బస్సు డ్రైవర్ పి.మల్లయ్యను ఆశ్రయించగా ఆయన చంటి బిడ్డను ఎత్తుకుని ఆమె బయటకు వెళ్లి వచ్చే వరకు లాలించాడు. ఈ విషయం తెలియడంతో ఆర్టీసీ ఆర్ఎం ఏ.సరిరామ్ సోమవారం మల్లయ్యను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు భవాని ప్రసాద్, జీఎస్ పవిత్ర, ఎ.నారాయణ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE

■ కొత్తగూడెం గౌతమ్‌నగర్ ఏరియాలలో 3 అంతస్తుల బిల్డింగ్ విడివిడిగా లేదా G+3 మొత్తం కలిపి అమ్మబడును. పడమర ఫేస్ కొత్త డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు, కవర్డ్, బ్యాంక్‌లోన్ ✆ 93989 23124 [G-2200]

Wanted

■ అఖిల ఐ హాస్పిటల్, నెహ్రూనగర్, ఖమ్మం నందు పని చేయుటకు నర్సెస్ GNM / ANM and డేటా ఎంట్రీ ఆపరేటర్స్ & అకౌంటెంట్ కావలెను. అమ్మాయిలకు మాత్రమే. మంచి జీతం... Good working Environment. Cont. 92981 57003. [M-12712]

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST 5% అదనం)

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9705444182, 9010299957
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416
సత్తుపల్లి : 9652868642
మధిర : 9949927792

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.